# ఆర్షవాఙ్మయం -వ్యక్తిత్వవికాసం

**– ఆచార్య గల్లా చలపతి**

ఋషులకు సంబంధించింది ఆర్షం. వాళ్లు బోధించే ఉపదేశ వాక్యాలు ఆర్షవాఙ్మయం. వాల్మీకి, వ్యాసుడు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైన వాళ్లంతా ఋషులు. వీళ్లు ఆత్మతత్త్వాన్ని దర్శించినవాళ్లు. లోక కల్యాణకారకమైన జ్ఞానాన్ని అందిందే గ్రంథాలను దర్శించి లోకానికందించారు. ఈ గ్రంథాలలోని విషయాలు సంప్రదాయాన్ని నిలబెట్టడమేగాక వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు ఇలాంటి గ్రంథాలు. ఈ గ్రంథాలన్నీ ఆర్షవాఙ్మయంలో భాగాలు.



**వేదవాఙ్మయం :**

ఋగ్వేద, యజుర్వేద, సామవేద అథర్వవేదాలు నాలుగూ విజ్ఞాననాదాయకాలు. ఇవి ఒక వర్గానికి సంబంధించినవి కావు. సమస్త మానవాళి సంక్షేమాన్ని, సమాజ శ్రేయస్సును, పర్యావరణ రక్షణను కాంక్షించాయి. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అనే గొప్ప విషయాలను వేదాలు ప్రతిపాదించాయి. తల్లిని, తండ్రిని, గురువును, అతిథిని దైవసమానులుగా భావించమని పై వాక్యాలకు అర్థం. ఈ నలుగురూ భగవంతునితో సమానులు. వీళ్లను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదని వేదాలు బోధించాయి.

**సత్యంవద, ధర్మంచర** అనే వాక్యాలు వేద వాఙ్మయంలో ప్రముఖంగా కనిపిస్తాయి. సత్యమే పలకాలి, ధర్మమార్గంలోనే నడవాలి అని పై వాక్యాలకు అర్థం. ఈ



రెండు వైదిక వాక్యాలకు ఎన్నో ఉదాహరణలు పురాణాలలో, కావ్యాలలో కనిపిస్తాయి. 'సత్యంవద' అనే మాటకు హరిశ్చంద్రుడి కథను ఉదాహరణంగా గ్రహించవచ్చు. రాజ్యాన్ని, ఆలుబిడ్డలను పోగొట్టుకోవలసి వచ్చినా హరిశ్చంద్రుడు సత్యాన్ని విడనాడలేదు. ఎన్ని కష్టాలనో ఎదుర్కొని తనను తానే అమ్ముకొన్నా సత్యపథం నుండి వైదొలగలేదు. చివరకు ఆ సత్యమే అతణ్ణి కాపాడింది. ఆయన కీర్తి ప్రతిష్ఠలు లోకంలో చిరస్థాయిగా నిలబడి పోయాయి. రామాయణ కావ్యనాయకుడైన శ్రీరామచంద్రుడు సత్యవాక్పాలన చేశాడు.

ధర్మమార్గంలోనే నడవాలని చెప్పిన వేద ప్రబోధాన్ని గురువు శిష్యులకు బోధిస్తాడు. మనిషి మనీషిగా అంటే గొప్ప వ్యక్తిత్వం గలవాడుగా అనిపించుకోవడానికి ఏ పద్ధతులను పాటించాలో ఆ పద్ధతులను అనుసరించడం ధర్మం. ధర్మం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే



శ్రీరామచంద్రుని జీవితాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. హరిశ్చంద్రుడి కథ, శ్రీరాముడికథ మొదలైన సత్యాన్నీ, ధర్మాన్నీ పాటించే వ్యక్తుల జీవితాలను చిత్రించిన భారత రామాయణాది గ్రంథాలు వేదాల సారాన్ని ఈ కథల ద్వారా మానవాళికి అందిస్తున్నందువల్ల ఆ గ్రంథాలు కూడా ఆర్ష గ్రంథాలే.

**ఆర్షవాఙ్మయం – నైతికత :**

మానవుడు నీతిగా బతకాలని అందరూ చెపుతారు. కాని నీతిని ఆచరిస్తూ బతకతడం ఎంతో కష్టం. సత్యం, ధర్మం, నీతి మొదలైన లక్షణాలన్నీ దివ్యలక్షణాలు. వీటిని ఆచరిస్తూ జీవించడమే నిజమైన జీవనమని వేదవాఙ్మయం చెపుతుంది. ఋగ్వేదంలో **'మనుర్భవ'** అనే వాక్యం అనేకమార్లు కనిపిస్తుంది. మనిషివి కమ్మని ఆమాటకర్థం. మానవ లక్షణాలను పెంపొందించుకొని,

జంతులక్షణాలను వదిలించుకొని పరిపూర్ణమైన మనిషివిని కమ్మని వేదవాఙ్మయం చెబుతుంది. ఈ మాటను వివరిస్తూ మన పురాణాలలో ఎన్నో కథలున్నాయి. ఆ కథలను చదివి లేదా విని ఆ కథలలో ప్రసక్తమయ్యే వ్యక్తులు ఆచరించిన నైతిక నిష్ఠను అర్థం చేసుకొని జీవనం సాగించాలని ఆ పురాణకథల ఉద్దేశం.

మన పురాణాల్లో ఎందరో చక్రవర్తులున్నారు. వాళ్లలో రాక్షసరాజైన బలిచక్రవర్తి ఒకడు. బలిచక్రవర్తి రాక్షసుడే అయినా అతనిలో గొప్ప సంస్కారముంది. రాక్షసులు యాగవిధ్వంసకులు. అయినా బలిచక్రవర్తి యాగం చేశాడు. అది విశేషం. యాగ సమయంలో తగిన వాళ్లకు దానం చేయడం సంప్రదాయం. ఆ యాగానికి విష్ణువే వామనమూర్తి రూపంలో యాచకుడుగా వచ్చాడు.



వామనుడు మూడడుగుల నేలను దానంగా ఇవ్వమన్నాడు. ఇస్తానన్నాడు బలి. వచ్చినవాడు రాక్షసహంతకుడైన మహావిష్ణువేనని తెలుసుకొని కులపురోహితుడైన శుక్రుడు ఇవ్వవద్దన్నాడు. ఈ విషయం తెలిసినా బలి దానం చేయడానికే నిశ్చయించుకొన్నాడు. యాగసందర్భాలలో దానం చేయడం ధార్మికనీతి. ఈ నీతిని బలి తప్ప లేదు. తనకు ఆపద కలుగుతుందని తెలిసికూడా వామనుడికి మూడడుగుల నేలను దానం చేయడం బలినైతిక నిష్ఠకు పరాకాష్ఠ. ఇలాగే రామాయణంలో శ్రీరాముని సోదరుడైన భరతుడు రాజనీతిని పాటించిన ఆదర్శవ్యక్తి. శ్రీరాముడు వనవాసానికి వెళ్లినపుడు వశిష్ఠాదులైన పెద్దలు భరతుణ్ణి అయోధ్యకు చక్రవర్తిని చేయాలని ప్రయత్నించారు.



అయినా అన్న ఉండగా తమ్ముడు రాజ్యపాలన చేయడం నీతికాదని భరతుడు సున్నితంగా తిరస్కరించాడు.

భరతుడువలె నైతికతను పాటించినవాళ్లు రామాయణంలో ఇంకా కొందరున్నారు. అలాంటివాళ్లలో విభీషణుడు చెప్పుకోదగినవాడు. రావణుడు సీతాదేవిని లంకకు బలవంతంగా తీసుకొని రావడం నీతి కాదని విభీషణుడు అన్నకు నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. రావణుడు వినకపోగా నిండుసభలో విభీషణుణ్ణి తన్ని పరాభవించాడు. విభీషణుడు అన్నను వదలి శ్రీరాముని పక్షంలో చేరి రావణుడికి సంబంధించి తాను గ్రహించిన ఎన్నో విషయాలను రాముడికి చెప్పి నైతికధర్మం పాటించి నైతికతకు మార్గదర్శకుడయ్యాడు.

దుర్యోధనుడి వల్ల అంగరాజ్యానికి రాజై రాజ్యార్హతను పొందిన కర్ణుడు నైతిక గుణశీలాలలో



గొప్పవాడుగా కనిపిస్తాడు. భారతపాత్రలలో కర్ణుడు నైతికతకు కట్టుబడిన మహావీరుడుగా చిత్రించబడినాడు. తనకు రాజ్యార్హతను కలిగించిన దుర్యోధనుడి ఋణం తీర్చుకోవడానికి తన జీవితాన్నే పణంగా పెట్టిన నైతిక నిష్ఠ కర్ణుడిది. ఈ నైతికతతో కర్ణుడు ఎంతో విధేయంగా ప్రవర్తించాడు. దుర్యోధనుడి మాటకు కట్టుబడిన కర్ణుడు ఏనాడూ తాను నమ్మిన నీతి నుండి వైదొలగలేదు. తాను కుంతికొడుకునని తెలిసినా నీతికాదని పాండవ పక్షంలోకి వెళ్లలేదు. ద్రౌపది తనకు రాణి అవుతుందని ఆశపెట్టినా కర్ణుడు నీతి తప్పి ప్రవర్తించలేదు. చివరకు అర్జునుడిచేతిలో మరణించాల్సి వచ్చినా నీతి తప్పకుండా బతికి తనువు చాలించాడు. ఈ విధంగా కర్ణుడి జీవితం నైతికతకు తార్కాణంగా కనిపిస్తుంది.

**కొన్ని వేదసూక్తులు :**

మానవ జీవితానికి అవసరమైన సూక్తులెన్నో వేదాలలో ఉన్నాయి. ఇవి ఆధ్యాత్మికంగా అనిపించినా లౌకికంగా కూడా మానవుడి దైనందిన జీవితానికి ఎంతగానో ఉపయోగపడేవిగా ఉన్నాయి. **'ప్రజాతంతు మా వ్యవచ్ఛేత్సీః'** అనేది ఒక వైదిక సూక్తి. మహర్షులు లోక కల్యాణాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పిన మాట ఇది. 'ప్రజా తంతువును విచ్ఛేదం చేయవద్దు' అని ఈ వాక్యానికి అర్థం. మానవుడు తన తరువాత తన సంతానాన్ని లోకంలో వదలి వెళ్లాలి. అలాకాకుంటే సృష్టి కొనసాగదు. సంతానం లేకుంటే పితృఋణం తీర్చేవారుండరు. తల్లిదండ్రులు తనకు శరీరం కల్పించినట్లే మానవుడు తాను కూడా కొన్నిజీవులకు శరీరం కల్పించడానికి సంకల్పించి పితృ ఋణం, దేవతల ఋణం తీర్చుకోవాలి. ఇది ఒక తరంవారు ముందుతరం వారికి చూపే కృతజ్ఞత. అందుకే



బ్రహ్మచర్యాశ్రమం తరువాత గృహస్థాశ్రమం స్వీకరించమని గురువు శిష్యులను ఆదేశిస్తాడు. గృహస్థాశ్రమం సృష్టి ధర్మానికి ప్రతీక. భారతీయ ధర్మం ప్రకారం ఆశ్రమాలన్నిటిలో గృహస్థాశ్రమం ఉత్తమోత్తమం.

అందరూ సుఖంగా ఉండాలి. అందరూ రోగాలబారిన పడకుండా ఆరోగ్యవంతులుగా ఉండాలి. అందరూ మంచినే చూడాలి. మంచినే పొందాలి. ఎవ్వరూ దుఃఖపడకూడదు. అందరిచెవులూ శుభాన్నే వినాలి. ఈ మాటలన్నీ వేదాలలో ఉన్నవే. ఇలాంటిమాటలెన్నో ఆర్షవాఙ్మయంలో ఉంటూ మానవ జీవితాలకు కరదీపికలుగా ఉపకరిస్తున్నాయి.

**'సహనావవతు సహనౌ భునక్తు**
**సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు**
**మా విద్విషావహై ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః'**



అనేది ఆర్షవాఙ్మయంలో గొప్ప శాంతి మంత్రం. "గురుశిష్యులైన మమ్మల్ని పరమాత్మ రక్షించుగాక. కలసి అనుభవింతుముగాక. కలసి విద్యాపరిశ్రమ చేయుదుము గాక. కార్యదక్షతతో పనులను చేయుదుముగాక. మేము చేసే అధ్యయనం తేజోవంతమగుగాక. మాలో మేము ద్వేషభావం లేకుండా ఉందుముగాక!" అని పై మంత్రానికి తాత్పర్యం. ఇంతకుమించిన భావన మరెక్కడా కనపడదు.

గోవుల్ని రక్షించాలి. గోసంపద పెరగాలి. గోహింస చేయకూడదు. భూమికి, ప్రజలకు మాతాపుత్ర సంబంధముంది. ఋతువులు, ఓషధులు, రాత్రింబవళ్లు, చెట్లు, వాతావరణం, సూర్యచంద్రాదులు మొదలైన సృష్టిలో ఉన్నవన్నీ భగవత్స్వరూపాలు. ఆర్షవాక్కులైన ఇవన్నీ ప్రకృతికి, మనిషికి గల సంబంధాన్నీ, ఆ సంబంధం ఎలా ఉండాలనే విషయాన్నీ తెలుపుతున్నాయి. భూమాత అనడంలో అర్థం ప్రజలు భూమికి బిడ్డలనేకదా!



దేవుడిరూపాలైన ఓషధుల్ని కాపాడుకోమని చెప్పింది యజుర్వేదం. మందు మొక్కలు సంజీవనులు. అవి ప్రాణుల ఆరోగ్యాన్ని కాపాడుతాయి. పర్యావరణాన్ని కలుషితం చేయకూడదని, చేయడంవల్ల మానవమనుగడ అస్తవ్యస్తం అవుతుందని కూడా వేద (ఆర్ష) వాఙ్మయం పేర్కొన్నది. ఇలా వేదవాఙ్మయం మానవ జీవితానికి అవసరమైన అనేక అంశాలను వివరించింది.

**ఉపనిషత్తులు :**

బ్రహ్మతత్త్వాన్ని లేదా ఆత్మతత్త్వాన్ని తెలియజేసే వేదభాగాన్ని ఉపనిషత్తు అటారు. వేదాల్లో చెప్పిన ముఖ్యమైన విషయాలను సంగ్రహంగా చివరలో చెప్పడంవల్ల వీటిని **శ్రుతి శిరస్సులు** లేదా **వేదాంత శాస్త్రాలు** అని కూడా అంటారు. ఉపనిషత్తులు అసంఖ్యాకంగా ఉన్నాయని, వాటిలో 108 ఉపనిషత్తులు

ముఖ్యమైనవి చెపుతారు. వాటిలో కూడా దశోపనిషత్తులు అతిప్రసిద్ధాలని చెపుతారు. కఠోపనిషత్తు, ముండకోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, ఛాందోగ్యో పనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు ఈ పదిలోకూడా ముఖ్యమైనవి. సంసార క్లేశాన్ని నశింపజేసి, పరమాత్మ సాక్షాత్కారాన్ని కలుగజేసేవి ఉపనిషత్తులు. గురువు సమీపంలో కూర్చొని శిష్యులు గ్రహించే పరమార్థం ఉపనిషత్తు అని కూడా వివరణ ఉంది. గురుశిష్యుల మధ్య పరబ్రహ్మాన్ని గురించి సాగే ఆధ్యాత్మిక చర్చలు ఉపనిషత్తుల ప్రధానాంశాలు.

**ఉపనిషత్కథలు :**

ఉపనిషత్తులలో ఆధ్యాత్మిక విషయాలను తెలపడానికి చిన్న చిన్న కథలున్నాయి. ఆ కథల ద్వారా ధర్మసూక్ష్మాలు, నైతిక విషయాలు, సంప్రదాయాల



విలువలు అర్థమవుతాయి. అలాంటి కథలు కూడా గురుశిష్యుల చర్చలలో భాగంగా ప్రసక్తమవుతూ ఉంటాయి. ఆత్మజ్ఞానాన్ని, ఆధ్యాత్మిక తత్త్వాన్ని సులువుగా బోధించే కథలివి. ఒకటి రెండు ఉనిషత్కథలను పరిశీలిస్తే ఉపనిషత్తులు ఎలాంటి ధర్మసూక్ష్మాలను సులభంగా బోధిస్తాయో తెలుస్తుంది.

ఒకప్పుడు ఒక గ్రామంలోని దేవాలయానికి ఒక గొల్లవనిత ఆవుపాలు తెచ్చి ఇస్తూ ఉండేది. ఆమె ఉన్న గ్రామం ఏటికి అవతల ఉంది. ఒకరోజు ఆమె పాలు తేలేదు. ఆలయపూజారి పాలెందుకు తేలేదని అడిగాడు. ఏటివరద రావడం వల్ల రాలేకపోయానన్నది. నువ్వు అంతగట్టిగా నమ్ముకొన్న దేవుని స్మరించుకొంటూ వస్తే ఏరుదాటడం కష్టం కాదన్నాడు పూజారి. మరుసటిరోజు ఆమె జోరువానలో కూడా పాలుతీసుకొని వచ్చింది. ఎలా వచ్చావని అడిగాడు పూజారి. మీరు చెప్పినట్లు దేవుని



తలచుకొంటూ ఏటినీటిమీద నడచి వచ్చానన్నది. పూజారి ఆశ్చర్యపోయాడు. ఆత్మవిశ్వాసం, నమ్మకం ఉన్నపుడు ఏపనినైనా సులువుగా చేయవచ్చునని ఈ కథ తెలుపు తుంది. త్రికరణశుద్ధిగా నమ్మినపుడు మాటమంత్ర మవుతుంది. మంత్రం ఫలిస్తుంది.

**మరోకథ :**

కఠోపనిషత్తులో నచికేతుడి కథ ఉంది. వాజశ్రవసుడు అనే బ్రాహ్మణుడు వేదోక్తంగా యాగం చేశాడు. యాగం సఫలం కావడానికి తన యావదాస్తి అయిన గోవులను దానం చేశాడు. కొడుకు కూడా తండ్రి ఆస్తి కదా అనుకొని ఆలయ కుమారుడైన నచికేతుడు నన్నెవరికి దానమిస్తున్నావని మాటిమాటికి అడగడంవల్ల వాజశ్రవసుడు విసుగుచెంది కోపంగా 'నిన్ను యముడికి దానం చేస్తున్నా' నన్నాడు. తండ్రి తాను చేసిన పొరపాటును గ్రహించి వద్దన్నా వినకుండా నచికేతుడు



యముణ్ణి కలుసుకోవడానికి యమలోకం వెళ్లాడు. దీన్నిబట్టి అతడికి తండ్రిమాట మీద ఎంత గౌరవముందో తెలుస్తుంది. ఆ సమయంలో యముడు ఇంటివద్దలేడు. మూడు రోజుల తరువాత యముడు ఇంటికి వచ్చాడు. అప్పటివరకు నచికేతుడు ఆహారం స్వీకరించకుండా వేచి ఉన్నాడు. మూడు రాత్రులు నచికేతుడు ఆహారం లేకుండా తనకోసం ఉండిన విషయం తెలిసి యముడు ఎంతగానో బాధపడ్డాడు. ఎందుకంటే ఎవరి ఇంటికి వచ్చి బ్రాహ్మణుడు భోజనం లేకుండా ఉంటాడో ఆ ఇంటివాళ్ల పుత్రుల, పశు వుల నాశనం జరుగుతుందని యముడికి తెలుసు. నచికేతుడు వచ్చినపుడు మూడురోజులు ఆతిథ్యం ఇవ్వకుండా తప్పిదం జరిగినందుకు యముడు నొచ్చుకొని దానికి పరిహారంగా మూడువరాలు కోరుకోమన్నాడు.

తన తండ్రికి కోపం లేకుండా ప్రేమతో ఉండాలని, తిరిగి ఇంటికి వెళ్లినపుడు గుర్తుపట్టి తనను

కొడుకుగా స్వీకరించేటట్లు వరమివ్వమని నచికేతుడు మొదటివరంగా కోరుకొన్నాడు. యముడు అలాగేనని వరమిచ్చి రెండవ వరం కోరుకోమన్నాడు. స్వర్గం పొందడానికి నీవద్ద గల అగ్నివిద్యను బోధించుమని నచికేతుడు రెండవవరంగా అడిగాడు. యముడు నచికేతుడికి అగ్నిచయన విద్యను బోధించాడు. ఇప్పటినుండి ఈ అగ్నివిద్య నచికేతాగ్నిగా పిలువబడు తుందని చెప్పాడు. నచికేతాగ్నిని ముడుసార్లు అనుష్ఠించేవాడు జనన మరణాలను అధిగమిస్తాడని కూడా వివరించాడు. లోకకల్యాణ కారకాలైన రెండువరాలు కోరిన నచికేతుడి ఆలోచనలకు యముడు సంతోషించి మూడవరం కోరుకోమన్నాడు.

మనిషి చనిపోయాక ఆత్మ ఉంటుందంటారు కొందరు. ఏమీ ఉండదటారు మరికొందరు. వీటిలో ఏది



నిజమో తెలుకోవాలనుకొంటున్నాను. ఈ విషయం తెలపండి. ఇదే నాకు మీరు ఇవ్వగల మూడోవరం అని అడిగాడు నచికేతుడు. అది చాలా సూక్ష్మమైన విషయమని, జ్ఞానులకు కూడా సరిగా అర్థం కాదు కాబట్టి దాన్ని వదలిపెట్టి మరేదైనా వరం కోరుకో మన్నాడు యముడు. నచికేతుడు పట్టుదలతో ఆ వరమే కావాలన్నాడు. అతని పట్టుదల గ్రహించిన యముడు ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. ఆత్మ శాశ్వతం. దానికి చావుపుట్టుకలు లేవు. ప్రసన్నమైన మనస్సు, ఇంద్రియజ్ఞానం ఉన్నవాడు మాత్రమే ఆత్మ స్వరూపాన్ని దర్శించగలడని చెపుతూ యముడు ఆత్మవిద్యను గ్రహించినవాడు ముక్తుడై బ్రహ్మలోకం పొందుతాడని కూడా చెప్పాడు. ఈ విషయాలు తెలుసుకొని నచికేతుడు వెళ్లి ధర్మబద్ధమైన జీవితం గడిపి ముక్తిపొందాడు.



పట్టుదల ఉంటే చిన్న పిల్లలైనా గొప్ప విద్యను సాధించ వచ్చునని నచికేతుడి కథ సందేశమిస్తుంది. బాలుడైన నచికేతుడి కారణంగా ఆత్మ విద్య, నచికేతాగ్ని లోకానికి లభించాయి. ఇలాంటి కథలెన్నో ఉపనిషత్తులలో ఉన్నాయి. ఇవన్నీ ఆత్మప్రబోధానికి, మానసిక వికాసానికి ఉపకరిస్తాయి.

**భగవద్గీత :**

కురుక్షేత్రంలో జరిగిన కౌరవపాండవ యుద్ధంలో యుద్ధం చేయలేనని ఆశక్తతను ప్రదర్శించిన అర్జునుడికి శ్రీకృష్ణభగవానుడు బోధించిన గీత భగవద్గీత. అర్జునుడికి కర్తవ్యనిష్ఠను కలిగించడానికి చేసిన బోధ అయినా ఇది మానవజాతికి ఉపయోగపడే విధంగా రూపొందింది. జీవితమే ఒక యుద్ధమని, మంచి చెడులమధ్య ఎప్పుడూ సంఘర్షణ ఉంటుందని, అటువంటి సమయంలో ఊరకే



ఉండకుండా తన శక్తి మేరకు పోరాడడం ధీరుల లక్షణమని భగవానుడు అర్జునుడికి చేసిన కర్తవ్యబోధ సర్వమానవాళికే వర్తిస్తుంది. ఫలితం ఆశించకుండా పనిచేయడం మానవుడి కర్తవ్యమని, రావలసిన ఫలితం అదే వస్తుందని చెప్పడం కర్తవ్య నిష్ఠను తెలియ జేస్తుంది. మనిషి తనకు కావలసిన దాన్ని సాధించుకోవాలి. దానికోసం ప్రయత్నించాలి. ప్రయత్నం లేకుండా ఏదీ దొరకదు. మనిషి ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. ఇంద్రియాలు అదుపులో ఉండకపోతే మనిషి కామక్రోధాలకు వశమై జీవితాన్ని చెడగొట్టుకుంటాడు.

మనిషి లౌకికంగాగాని, ఆధ్యాత్మికంగా గాని ఎదగడానికి దుఃఖం పెద్ద ఆటంకం. ఆనందం మనిషికి సహజస్థితి. సుఖదుఃఖాలను, జయాపజయాలను, సమంగా భావించినపుడు మనిషిలో స్థితప్రజ్ఞత్వం

ఏర్పడుతుంది. అన్ని విషయాలలో సమబుద్ధి కలిగి ఉండడమే స్థితప్రజ్ఞత్వం. ఏ ప్రాణిపట్ల ద్వేషం లేకుండా ఉండడం; స్నేహ, కారుణ్యభావాలు కలిగి ఉండడం; క్షమాగుణం కలిగి ఉండడం; సుఖదుఃఖాలను సమంగా చూడడం; ఎప్పుడూ ప్రయత్నశీలిగా ఉండడం; మనస్సును, బుద్ధిని భగవంతుడికి అర్పణ చేయడం; కోపం, భయం లేకుండా ఉండడం; సంతృప్తికలిగి ఉండడం; స్థిరబుద్ధితో ఉండడం మొదలైనవన్నీ ఉత్తమ గుణాలని, వీటిని ఆచరించడమే యోగమని గీత చెపుతుంది.

మానవజాతికి అన్ని కాలాల్లోనూ కావలసిన ఉపదేశం భగవద్గీతలో లభిస్తుంది. అది సర్వసమస్యలకూ పరిష్కారం చూపిస్తుంది. మనిషి బతకడానికి, బతుకుకొక సార్థకత కలగడానికి, ఆత్మోన్నత్యం పొందడానికి, ఆత్మసాక్షాత్కారం పొందడానికి భగవద్గీతవలె మహోపదేశం చేసేది మరొకటిలేదు.



మానవుడు ఆత్మోన్నతిని పొందడమే వికాసం. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మొదలైనవన్నీ ఆర్షవాఙ్మయంలోని భాగాలు. వీటిలోని కథలు, సంఘటనలు, పాత్రలు, పాత్రలు ప్రవర్తించిన తీరులు మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తూ ఎదురైన ప్రతిసమస్యకూ చక్కని పరిష్కారం చూపుతాయి. ఏ పనులు చేయాలో, ఏ పనులు చేయకూడదో, ఎలా ప్రవర్తిస్తే సంప్రదాయం రక్షింపబడుతుందో, ఎలా ప్రవర్తించకుంటే సంప్రదాయం చెడిపోతుందో, మానవులకు ఏవి మంచి గుణాలో, ఏవి కావో, ధర్మం, సత్యం, నీతి, కర్తవ్యనిష్ఠ, పరోపకార పారీణత, నిస్స్వార్థ బుద్ధి ఎలా అలవరచుకోవాలో ఆర్షవాఙ్మయం ప్రబోధిస్తుంది. మానవుడు మహోన్నతుడుగా మారడానికి కావలసిన సలహాలను అందిస్తుంది.



## ఆర్షవాఙ్మయం - మానసిక వికాసం

మొగ్గ పుష్పించడం ఎలాంటిదో మనస్సు వికసించడం అలాంటిది. ప్రకృతి సిద్ధంగా మొగ్గ పుష్పిస్తే ఆలోచనలవల్ల మనస్సు వికసిస్తుంది. ఆర్షవాఙ్మయంలోని అనేకాంశాలను తెలుసుకోవడంవల్ల మనస్సు వికాసం చెందుతుంది. విజ్ఞాన విషయాలు అనుభవంలోకి వచ్చినపుడు ఆనందం కలుగుతుంది. మానసిక వికాసానికి ఆనందం తొలిమెట్టు. సర్వజన స్నేహం వృద్ధిచేసుకోవాలి. దుఃఖించేవాళ్లపట్ల దయ కలిగి ఉండాలి. సుఖించేవాళ్లపట్ల సంతోషంగా ఉండాలి. పుణ్యకార్యాలపట్ల ఉత్సాహం, పాపకార్యాలపట్ల విముఖత్వం మనస్సులో అభివృద్ధి చేసుకొంటే మానసిక వికాసం కలుగుతుంది. దీనికి ఆర్షవాఙ్మయంలో కనిపించే ఆధ్యాత్మికకథలు ఉపయోగపడతాయి. మానసిక వికాసం కలిగిన వ్యక్తి



ఉదాత్తంగా, సందర్భోచితంగా ప్రవర్తిస్తాడు. దీనివల్ల ఇతరుల మన్నన పొందుతాడు. ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా మెలగుతాడు. దీనిని తెలిపే మంచి ఉదాహరణలెన్నో ఉన్నాయి.

సందర్భానికి తగిన విధంగా మాట్లాడడం గొప్ప సంస్కార లక్షణం. పురాణాలలోగల సంస్కారవంతమైన పాత్రలను గురించి వినడం, చదవడం, తెలుసుకోవడం వల్ల మనిషిలో సంస్కారం ఏర్పడుతుంది. ఒక సంస్కారవంతుడి ప్రభావంలో మరెందరో సంస్కారవంతులవుతారు. శ్రీరాముడు తన అవతార ప్రయోజనాలు నెరవేర్చినా ఇంకా భూలోకంలోనే ఉండాలనుకుంటాడేమో తెలుసుకొని రమ్మని బ్రహ్మ యమధర్మరాజును పంపాడు. అతడు శ్రీరాముడి వద్దకు వెళ్ళి "శ్రీరామా! మీ అవతార సమాప్తి సమయం దగ్గరపడుతున్నదికదా! ఈ అవతారంలో మీరు

ఇంకా కొంతకాలం కొనసాగాలనుకొంటున్నారా? అని బ్రహ్మ మిమ్మల్ని అడిగి తెలుసుకొని రమ్మన్నారు” అన్నాడు. బ్రహ్మ అడగమన్నమాటలో మర్యాద, హుందాతనం, పెద్దచిన్నల తారతమ్యం వ్యక్తమవుతున్నాయి. బ్రహ్మ సృష్టికర్త అయినా శ్రీరాముడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు. తన తండ్రి అయిన విష్ణుమూర్తిని ప్రశ్నించడం ఎలా ఉంటుందో శ్రీరాముని ప్రశ్నించడం అలా ఉంటుంది. తండ్రిని ప్రశ్నించడం మర్యాద కాదు. అది అవిధేయతే అవుతుంది. అందువల్ల బ్రహ్మ చాల జాగ్రత్తగా తనమాటను చెప్పిపంపాడు. ఇలాంటి విషయాలు తెలుసుకొంటే ఎవరితో ఎలా మాట్లడాలో అర్థమవుతుంది.

పురాణాలలోని ఇలాంటి కథలవల్ల జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం వల్ల మనస్సు ప్రశాంతపడి సంస్కారవంతమవుతుంది. సంస్కారవంతమైన మనస్సు



వికాసం పొందుతుంది. భౌతిక సంపదలు సుఖాన్ని స్తాయేగాని ఆనందాన్నివ్వవు. సుఖానికి, ఆనందానికి చాలా తేడా ఉంది. సుఖస్థాయికన్నా ఆనందస్థాయి ఉన్నతమైంది. ఆనందం భౌతిక సంపదలవల్ల కాక ఆధ్యాత్మిక జ్ఞానం వల్ల కలుగుతుంది. భారతీయ ఆర్షసాహిత్యం మనిషిని ఆధ్యాత్మపథంవైపు పయనింపజేస్తుంది. ప్రతిమానవుడిలో దైవత్వం స్వతసిద్ధంగా ఉంటుంది. దాన్ని వ్యక్తీకరించడమే విద్య అన్నారు స్వామి వివేకానందులవారు. మనిషిలో ఏర్పడే ఆధ్యాత్మికత అతనిలోని దైవత్వాన్ని పెంపొందిస్తుంది. దీనికి మహర్షుల అనుభవాలను తెలుసుకోవాలి. వాళ్ల అనుభవాలు ఆర్షవాఙ్మయానికి చెందిన గ్రంథాలన్నింటిలో ఉన్నాయి.

ఆర్షవాఙ్మయంలో పురాణాలు ప్రధానంగా కనిపిస్తాయి. పురాణాలు పద్దెనిమిది. వీటిలో భాగవతపురాణం భగవంతుడైన శ్రీకృష్ణుడి వృత్తాంతాన్ని



విపులంగా చెప్పింది. భగవంతుడి వృత్తాంతంతోపాటు ఆయన భక్తుల కథలను కూడా చెప్పింది. నవవిధ భక్తిమార్గాలకు ప్రతీకలుగా కనిపించే భక్తుల కథల ద్వారా మానవుడు ఎలా ఆధ్యాత్మభావాలు అలవరచుకోవాలో తెలిపింది భాగవతం. ఈ పురాణంలో హిరణ్యకశిపుడు వంటి దుష్టపాత్రలున్నాయి. ప్రహ్లాదుడు వంటి సాత్త్విక పాత్రలున్నాయి. ఆయా కథాఘట్టాలలో ఈ పాత్రలు ప్రవర్తించిన తీరులను బట్టి చదువరులకు లేదా శ్రోతలకు జీవితాన్ని ఎలా గడపాలో అర్థమవుతుంది. అదే మానసిక వికాసాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు ప్రహ్లాదుడి పాత్రను పరిశీలిస్తే అతడి గుణశీలాదులు ఎంతగానో ప్రశంసనీయంగా కనిపిస్తాయి. దైవభక్తికి ప్రాధాన్యమిస్తూ ప్రహ్లాదుడు ప్రవర్తించిన తీరు, మాట్లాడిన వైఖరి ఇతరులను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. ప్రహ్లాదుడు లలితమర్యాదుడని భాగవతం చెప్పింది. లలితమర్యాదుడనే



పదానికి గొప్ప అర్థముంది. ప్రహ్లాదుడు సర్వభూతాల్లోనూ ఉండేది ఒకే ఆత్మ అని భావించేవాడు. గౌరవించదగిన పెద్దలకు సేవకుడిలా వినయంగా నమస్కరించేవాడు. స్త్రీలందరినీ తల్లులుగా భావించేవాడు. స్నేహితులను సోదరులుగా, గురువులను దేవతలుగా భావించేవాడు. ఆటలపాటలలో కూడా అబద్ధాలు చెప్పేవాడుకాదు. ఈ లక్షణాలన్నీ ‘లలితమర్యాద’లో ఉన్నాయి. ఆర్షవాఙ్మయానికి అలంకారప్రాయమైన భాగవతపురాణం మనిషిలో భక్తిభావాలను ప్రేరేపించడమేగాక ఆధ్యాత్మిక అంశాలను అందిస్తూ మనసుకు ప్రశాంతతను, ఏకాగ్రతను కలిగిస్తుంది. భాగవతపాత్రలు మనస్సు అనే అద్దంలో కనిపిస్తూ ఎంతో స్ఫూర్తిని కలిగిస్తాయి. అద్దంలో దుష్టపాత్రలు మసకగాను, మంచి పాత్రలు స్వచ్ఛంగాను కనిపిస్తాయి. అద్దంలో కనిపించే స్వచ్ఛతవలె మనస్సులో స్ఫూర్తిని నింపి ప్రశాంతను కలిగిస్తాయి.

## ఆర్షవాఙ్మయం - లౌకిక జీవనం

ఆర్షవాఙ్మయంలో ముందు చర్చించిన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలతోపాటు వివిధశాస్త్రాలు, కావ్యాలు కూడా చేరతాయి. ఈ గ్రంథాలన్నీ సంస్కృత భాషలో ఉన్నాయి. సంస్కృత భాషను దేవభాష అని కూడా అంటారు. సమ్యక్ (చక్కగా) కృతి (చేయబడింది) సంస్కృతి. బాగా చేయబడింది అని ఈ మాటకర్థం. ఈ భాషద్వారా పఠితలకు లేదా శ్రోతలకు తెలియదగిన విషయాలెన్నో ఉన్నాయి. ఆచారవ్యవహారాలు, ఆహారవ్యవహారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, పండుగలు, విశ్వాసాలు, వినోదాలు మొదలైవన్నీ తెలుస్తున్నాయి. ఇవన్నీ జీవన వ్యవహారాలకు సంబంధించినవి. సంస్కృతభాష సంస్కారవంతమైన భాష. సకల శాస్త్ర సాహిత్యమంతా ఈ భాషలోనే ఉంది. భారతీయ సంస్కృతి శాస్త్రసాహిత్యం ద్వారా వ్యక్తమవుతుంది.



కావ్యసాహిత్యమనగానే కాళిదాసు రఘువంశం, కుమారసంభవం, అభిజ్ఞానశాకుంతల నాటకం మొదలైనవి ముఖ్యంగా కన్పిస్తాయి. ఈ గ్రంథాల్లో భారతీయ సంస్కృతి నిక్షిప్తమై ఉంది. దీనితోపాటు మానవ జీవితంలో ఆచరింపదగిన ఆచారవ్యవహారాలెన్నో కనిపిస్తాయి. మనిషి జీవితంలోని నాలుగు దశలను కాళిదాసు రచించిన రఘువంశం కావ్యం ఇలా చెప్పింది.

**శైశవేఽభ్యస్తవిద్యానాం యౌవనే విషయౌషిణామ్**
**వార్థకే మునివృత్తీనాం యోగేనాన్తే తను త్యజామ్.**

బ్రహ్మచారిగా విద్యాభ్యాసం గృహస్తుగా విషయతృప్తిని, వానప్రస్థంలో మునివృత్తిని, సన్యాసాశ్రమంలో సర్వసంగపరిత్యాగాన్ని అనుభవించవలసి ఉంటుందని పై రఘువంశ శ్లోకం ద్వారా తెలుస్తుంది. ఇలా చేయడం వల్ల మనిషి జీవితంలో ఒక దశ మరో దశకు ఆటంకంగా



మారడానికి అవకాశం ఉండదు. బ్రహ్మచారిగా ఉన్నపుడు విద్యాభ్యాసం చేయాలి. మరొక పనిని ప్రధానంగా చేయకూడదు. గృహస్థుడుగా ఉన్నపుడు విద్యాభ్యాసం చేసినా అంతగా పట్టుపడదు. అందువల్ల ఏ జీవితదశలో చేయవలసిన పనిని ఆ దశలోనే చేయాలని పెద్దలు చెప్పిన విషయాన్ని పై శ్లోకం రఘువంశపు రాజుల జీవిత దశలిలా ఉంటాయని చెపుతూ సమస్తమానవాళి అలాగే ప్రవర్తించాలని నిర్దేశించడం కనిపిస్తుంది.

రఘువంశపురాజులు దానం చేయడానికే ధనం సంపాదించేవారట. సత్యమే చెప్పడం వాళ్ల వ్రతం కాబట్టి అబద్ధాలు దొర్లకుండా అతి తక్కువగా మాట్లాడేవారట. రాజ్యాలను జయించడం రాజ్యకాంక్షతోనే ధనకాంక్షతోనే కాదు, కీర్తి కోసమేనట. వివాహం కామతృప్తి కోసం కాకుండా సంతానం కోసం మాత్రమే చేసుకొనేవారట. ఈ విధమైన అలవాట్లు గలవారు రఘువంశపురాజులు.



కాళిదాసు ఈ విషయాలను కేవలం రఘువంశరాజులకు సంబంధించేకాకుండా సమస్త మానవాళి ఆ విధంగా ప్రవర్తించాలని, అదే భాతీయ సంస్కృతి అని రఘువంశ కావ్యంలో తెలియజేశాడు.

కుమారసంభవం కావ్యంలో హిమవంతుడు తన కుమార్తె పార్వతిని తపస్సు చేసుకొంటున్న శివుడు సేవకు నియోగించాడు. పెద్దల సేవకు దాసీజనాన్ని వినియోగించకుండా తమ ఇంటి ఆడపిల్లలను వినియోగించడం ఆనాటి పద్ధతి.

ఇంటి ఆడపిల్లలు పెద్దవాళ్లను సేవించి వాళ్ల ఆశీస్సులు పొందడం ఇందులోని ఉద్దేశం. అలా పెద్దలను సేవించే అమ్మాయిలకు అతిథిమర్యాదలు కూడా తెలుస్తాయి. పెద్దలు మాట్లాడుకొంటూ ఉన్నపుడు పిల్లలు కల్పించుకొని మాట్లాడడం మన సంస్కృతికాదు. నారదుడు

హిమవంతుడితో మాట్లాడిన సందర్భంలో పార్వతి తాను వాళ్ల సంభాషణను వినడంలేదు అనిపించేవిధంగా లీలాకమలం రేకులు లెక్కపెడుతున్నట్లుగా ఉండిపోయింది. ఈ విషయం చెప్పడం ద్వారా కాళిదాసు ఆ సంస్కృతిని తెలియేశాడు. చిన్న పెద్ద తారతమ్యం తెలియకుండా ఇష్టంవచ్చినట్లు మాట్లాడడం గొప్ప అనుకొనే ఈ రోజుల్లో ఈ నాటి పిల్లలు తప్పక తెలుసుకోవలసిన విషయమిది.

అభిజ్ఞాన శాకుంతలనాటకంలో కణ్వమహర్షి శకుంతలను అత్తవారింటికి పంపుతూ చెప్పిన మాటలు భారతీయ గృహిణీ ధర్మానికి అద్దం పడుతున్నాయి. తోడికోడళ్లతో కలహించవద్దు. పరిజనులకు తగినవిధంగా బహుమతులనిస్తూ ప్రేమగా చూడు. ఇతర విషయాలవల్ల భర్త ఎప్పుడైనా కోపడినా శాంతంగాఉండు. కణ్వుడు శకుంతలకు చెప్పిన మాటలు తల్లిదండ్రులు తమ



కూతుళ్లను అత్తవారింటికి పంపేటప్పుడు చెప్పవలసిన మాటలు. అత్తవారింట్లో కోడలు అలా ప్రవర్తిస్తే ఉత్తమ గృహిణి అవుతుంది. స్నేహధర్మానికి ఈ నాటకంలో అనసూయా ప్రియంవదలు ప్రతీకలుగా కనిపిస్తారు. శకుంతలతో వీళ్లకు గల స్నేహం లోకంలో స్నేహితులు ఎలా ఉండాలో చూపుతుంది. ఇలాగే సంస్కృత సాహిత్యంలో ఎప్పటికీ ఆచరించవలసిన సాంస్కృతిక విశేషాలెన్నో ఉన్నాయి.

ఆర్షవాఙ్మయం ప్రతిపాదించిన కొన్ని సూక్తులీవిధంగా ఉన్నాయి. పెద్దలు వచ్చినప్పుడు నమస్కరించడం, ఆసనమిచ్చి గౌరవించడం, వాళ్లు వెళ్లేటప్పుడు వాళ్లతోపాటు కొంతదూరంపోయి వీడ్కోలు చెప్పడం మంచి సంస్కృతి. ఇది పెద్దలను గౌరవించ వలసిన పద్ధతి కూడా. చిన్న పిల్లవాడుచెప్పినా మంచి



మాట అయితే పెద్దవాళ్లు కూడా విని ఆచరించవచ్చు. ఎక్కడున్నా మంచిని గ్రహించాలి. వ్యర్థంగా సమయం గడపడం వల్ల హాని కలుగుతుంది. కాలాన్ని వృథా చేయకుండా మంచి పనులతో గడపాలి. ప్రజ్ఞ, ఇంద్రియ నిగ్రహం, శాస్త్రజ్ఞానం కలిగి ఉండడం, అతిగా మాట్లాడకుండా ఉండడం, యథాశక్తిగా దానం చేయడం, కృతజ్ఞతతో ప్రవర్తించడం అనే మంచి గుణాలు అలవరచుకోవడం వల్ల మానవజీవితం ప్రకాశిస్తుంది. అతికోపం, కఠినంగా మాట్లాడడం, ఆత్మీయులతో వైరం పెట్టుకోవడం, అనవసర ప్రసంగాలు చేయడం, హీనులను సేవించడం చేయకూడని పనులు. ఈ పనుల వల్ల ఎన్నో కష్టాలు ఎదురవుతాయి. ఎవరిదగ్గరా చేయిచాపి యాచించకుండా ఉండడం, సుఖంగా మరణించాలను కోవడం, పోయాక మళ్లీ జన్మలేకుండా ఉండాలనుకోవడం మనిషి కోరుకోవలసిన ముఖ్యవిషయాలు. ఈ మూడు



వరాలను ప్రసాదించుమని దేవుణ్ణి ప్రార్థించడం మన సంస్కృతి.

కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడి బోధనలు, ఉపదేశాలు విన్న అర్జునుడు ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా! నీదయవల్ల నామోహం తొలగింది. అనుమానాలన్నీ పటాపంచ లయ్యాయి. నీమాటమీదనే నేను నడుస్తా". శ్రీకృష్ణుడి మాటలవల్ల అర్జునుడిలో ఉండిన సహజమైన దౌర్బల్యాలు తొలగిపోయినట్లు ఆర్షవాఙ్మయంలోని విషయాలను తెలుసుకొంటే అందరికీ సందేహాలు తొలగిపోతాయి. తెలుసుకోదగిన విషయాలేవో తెలుస్తాయి. సంప్రదాయం అర్థమవుతుంది. మానసిక వికాసం కలుగుతుంది. ఆనందంగా జీవించడం ఎలాగో తెలుస్తుంది. 'సర్వేజనాస్సుఖినో భవంతు' అనే ఆర్షవాక్కు సార్థకమవుతుంది.

## మరికొన్ని విశేషాలు

ఆర్షవాఙ్మయం బోధించిన అంశాలలో నిస్స్వార్థపరత్వం, ఏకాగ్రత, త్యాగగుణం అనేవి అత్యంత ముఖ్యమైన విషయాలు. ఈ అంశాలను వివరించడానికి కూడా ఆర్షవాఙ్మయంలో ఎన్నో ఉదాహరణలున్నాయి.

ఒకసారి దేవతలకు, రాక్షసులకు, మానవులకు బ్రహ్మదేవుడు విందు ఏర్పాటు చేశాడు. విస్తళ్లలో రుచికరమైన పదార్థాలు వడ్డించారు. తినడానికి వాళ్లు విస్తళ్లలో చేతులు పెట్టారు. అందరి చేతులూ వంగకుండా బిగుసుకొని పోయాయి. తినలేక పోయారు. ఎడమచేతితో ప్రయత్నం చేసినా అదీ వంగలేదు. రాక్షసులు రకరకాల ప్రయత్నంచేసి జంతువులవలె బోర్లాపడుకొని విస్తళ్లలోకి వంగి నేరుగా నోటితో తినడం మొదలు పెట్టారు. మానవులు కూడా తమ చేతులు వంగకపోవడం గ్రహించి



తమ విస్తళ్లతో ఒకరికొకరు ఎదురెదురుగా కూర్చొని పరస్పరం చేతులతో అందించుకొంటూ తిన్నారు. దేవతలు రాక్షసులకు, మానవులకు తమ అన్నం వడ్డించారు. ఈ ముగ్గురి మనస్తత్వాలివి. రాక్షసులు ఒకరికి ఇవ్వక పరస్పరం సహకరించక ఎవరికి వాళ్లు తమకు తాము కడుపు నింపుకొన్నారు. మానవులు పరస్పరం సహకరించుకొన్నారు. దేవతలు ఒకరికిస్తారు. స్వార్థంతో తమకే కావాలనుకొని ఏదో విధంగా అనుభవించాలనుకొనేవాళ్ళు రాక్షసజాతికి చెందుతారు. ఒకరి కొకరు సహకరించుకొనేవాళ్లు మానవులు. తమకు వద్దని ఇతరులకు ఇచ్చేవాళ్లు దేవతలు. మనం ఏ జాతికి చెందినవాళ్లమో ఆలోచించుకోవాలి. స్వార్థానికి రాక్షసులు, నిస్వార్థపరత్వానికి దేవతలు మంచి ఉదాహరణలుగా నిలుస్తారు.



ఏకాగ్రతకు భారతంలో మంచి ఉదాహరణ అర్జునుడు మత్స్యయంత్రాన్ని కొట్టడం. ఎందరో ప్రయత్నించినా కొట్టలేక పోయారు. ఏకాగ్రతతో అర్జునుడు మాత్రమే చేయగలిగాడీపని. దాంతో అర్జునుడు ద్రౌపదిని వివాహమాడగలిగాడు. “ఒక ఆలోచన కలిగితే దాన్నే జీవితాశయంగా మలచుకోవాలి. దాన్నే స్మరిస్తూ ఉండాలి. దాన్ని పొందడానికి తపించాలి. దాన్ని సాధించడానికి ఏకాగ్రత అవసరం. ఏది సాధించాలన్నా గట్టిగా ఏకాగ్రతతో ప్రయత్నించాలి” అని వివేకానందస్వామి బోధించారు. క్షీరసాగారాన్ని మథించిన సందర్భంలో ముందు హాలాహలవిషం పుట్టింది. అయినా దేవతలు భయపడలేదు. ప్రయత్నం వీడకుండా అమృతం పొందేవరకు మథించారు. మానవులు ఈ విషయాలన గ్రహించి చేపట్టిన ఏపనినైనా ఏకాగ్రతతో చేసి పూర్తి చేయాలి.



త్యాగగుణం గొప్పదైవలక్షణం. తనకున్న దాంట్లో ఏ కొద్దిగానైనా ఇతరులకు ఇవ్వాలనుకోవడం త్యాగగుణం. ఇది పరోపకార లక్షణం కూడా. వెనుకాముందూ చూచుకోకుండా దానధర్మాలు చేసి ఆర్షవాఙ్మయంలో మహాత్యాగశీలిగా పేరుపొందినవాడు రంతిదేవుడు. ఈయన కథ భాగవతపురాణంలో ఉంది. రంతిదేవుడు ఒకరాజు. దానాలు చేసి సర్వస్వం కోల్పోయాడు. ఒక సమయంలో 48 రోజుల వరకు ఆహారం లేకుండా ఉండి పోవలసివచ్చింది. ఒకరోజు దేవుడి దయవల్ల కొంత ఆహారం దొరికింది. కుటుంబ సభ్యులు, తానూ తినడానికి ప్రయత్నించారు. ఆసమయంలో ఒక బ్రహ్మణుడు యాచకుడుగా వచ్చాడు. రాజు తన అన్నంలో సగభాగం అతడికిచ్చాడు. అంతలో ఒక శూద్రుడు వచ్చి అన్నం పెట్టమని అడగగా మిగిలిన దాంట్లో సగం ఇచ్చేశాడు. తరువాత మరొకడు కుక్కల్ని పట్టుకొనివచ్చి ఆకలి! ఆకలి!

అన్నాడు. రంతిదేవుడు తన దగ్గరున్న మిగిలినదంతా ఇచ్చేశాడు. అప్పుడు ఇంకొకడు వచ్చి ఆకలిదప్పులతో ఉన్నానని, కొన్ని నీళ్లైనా పోసి బతికించమని వేడుకొన్నాడు. అప్పుడు రంతిదేవుడు చెప్పిన విషయం ఈ కింది పద్యంలో ఉంది.

**'అన్నములేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న, రా**
**వన్న శరీరధారులకు ఆపదవచ్చిన వారి ఆపదల్**
**క్రన్నన మాన్చి, వారికి సుఖంబులు సేయుటకన్న నొండు మే**
**లున్నదె, నాకు దిక్కు పురుషోత్తముడొక్కడె సుమ్ము....'**

నీకు పెట్టడానికి నాదగ్గర కొన్ని తియ్యని నీళ్లు మాత్రం ఉన్నాయి. వచ్చి గ్రహించు. శరీరాలు ధరించిన మానవులకెవరికైనా వాళ్ల ఆపదలు పోగొట్టి సుఖాలు కలిగించడంకంటే మించిన మేలు మరొకటి లేదు అని పై పద్యభావం.



జాతిమతభేదాలు లేకుండా తనకున్నదంతా దానం చేసిన ధర్మాత్ముడు రంతిదేవుడు. త్రిమూర్తులు ప్రత్యక్షమై ఏమి మావాలని అడిగినా నిరంతరం మానవసేవ చేసే శక్తిని, నారాయణునిపై అచంచలభక్తిని ఇవ్వమని కోరుకొన్న రంతిదేవుడు త్యాగగుణంలో ప్రపంచానికే ఆదర్శ వంతుడైనాడు.

ఇలా ఆర్షవాఙ్మయం మానవులు అలవరచుకోదగిన గొప్ప దివ్యలక్షణాలలెన్నిటినో కథల రూపంలో వివరించింది.

* * *